సాక్షి
విశాఖపట్నం
సోమవారం : 18 : ఆగస్టు : 2025



ఈపీడీసీఎల్‌లో బదిలీల బంతాట! 8లో



ఎమ్మెల్యే కూనపై చర్యలకు డిమాండ్ 8లో



కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా ఆదివారం ముగిశాయి.

న్యూస్‌రీల్

ఎఫ్‌డీపీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాంకేతిక విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ కె. పద్మారావు

మురళీనగర్: జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్.డి.పి) ను విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం నుంచి నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 300 కళాశాలల్లో విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీ కూడా ఉందని కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నకుమార్ తెలిపారు. 'న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్' అనే అంశంపై ఈ కార్యక్రమం ఈనెల 18 నుంచి 23 వరకు జరుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి దాదాపు 50 మంది అధ్యాపకులు, పరిశోధకులు ఈ ఆఫ్‌లైన్ శిక్షణలో పాల్గొంటారు. కార్యక్రమంలో డిజైన్ థింకింగ్‌లో సంఖ్యా విధానాలు, అడ్వాన్స్‌డ్ పద్ధతులు, ఫైనైట్ ఎలిమెంట్స్ వంటి అంశాలపై నిపుణులు శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమాన్ని కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. నారాయణరావు రూపొందించగా, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

హాఫ్ మారథాన్‌లో దాట్ల రామరాజు 3వ స్థానం



హాఫ్ మారథాన్‌లో షీల్డ్ అందుకుంటున్న దాట్ల రామరాజు

తాటిచెట్లపాలెం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మౌంట్ అబూలో జరిగిన అంతర్జాతీయ హాఫ్ మారథాన్‌లో విశాఖకు చెందిన దాట్ల రామరాజు మూడో స్థానంలో నిలిచారు. వెటరన్ కేటగిరీలో 21 కిలోమీటర్ల దూరాన్ని 1 గంట 43 నిమిషాల్లో పూర్తిచేసి, విశాఖ కీర్తిని పెంచారు. విశ్వ సౌభ్రాతృత్వం సందేశాన్ని చాటడానికి నిర్వహించిన ఈ మారథాన్‌లో సుమారు 3,500 మంది జాతీయ, అంతర్జాతీయ రన్నర్లు పాల్గొన్నారు. ఈ విజయాన్ని సాధించినందుకుగాను రామరాజు రూ. 51,000 బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ విజయం పట్ల బ్రహ్మకుమారీస్ రైల్వే న్యూ కాలనీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తింపు లేని ఆస్పత్రికి నోటీసు

మహారాణిపేట: నగరంలో అనుమతులు లేని ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ప్రకాశరావుపేటలోని వెంకటేశ్వర ఆస్పత్రికి డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు మూసివేత నోటీసు జారీ చేశారు. ఈ ఆస్పత్రికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఎటువంటి గుర్తింపు లేనప్పటికీ, రోగులకు వైద్య సేవలు అందించడంతో పాటు శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. వెంటనే ఆస్పత్రిని మూసివేయకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్‌వో హెచ్చరించారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

పెందుర్తి: వర్షాలు ముమ్మరంగా కురుస్తున్న నేపథ్యంలో నగర ప్రజలంతా.. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని మేయర్ పీలా శ్రీనివాసరావు సూచించారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తనకే ఫోన్ చేయొచ్చన్నారు. పెందుర్తి కూడలి వద్ద వర్షపు నీటి సమస్యను ఆదివారం రాత్రి మేయర్ పరిశీలించారు. నిల్వ ఉన్న నీటిని పారిశుధ్య కార్మికులతో బయటకు పంపే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ వర్షాలు ఉధృతంగా కురుస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు చెప్పారు. మేయర్ వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎస్. హరేందిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ సమయంలో అన్ని శాఖల జిల్లా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారు. సమస్యలు ఉన్నవారు తమ వివరాలతోపాటు తమ అర్జీలను అందజేయవచ్చు. గతంలో దరఖాస్తు చేసిన వారు, ఆ దరఖాస్తుకు సంబంధించిన స్లిప్‌ను వెంట తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

విశాఖ విలవిల

- జిల్లాని ముంచెత్తుతున్న భారీ వర్షాలు
- దాదాపు 12 గంటల పాటు ఎడతెరిపి లేకుండా అతి భారీ వర్షం
- తీరం వెంబడి 65 కిమీ వేగంతో ఈదురుగాలులు
- ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలతో అల్లకల్లోలంగా సముద్రం
- జలమయమైన రహదారులు.. పొంగి పొర్లుతున్న గెడ్డలు
- కొండవాలు ప్రాంతంలో కూలిన రక్షణ గోడతో ఆందోళనలో ప్రజలు
- ఐఎండీ హెచ్చరించినా.. ముందస్తు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం

నగరానికి సమీపంలో అల్పపీడనం



జగదాంబ నుంచి పోస్టాఫీస్‌కు వెళ్లే రోడ్డులో భారీగా చేరిన వర్షపునీరు



వెలంపేటలో ప్రజల పాట్లు

సాక్షి, విశాఖపట్నం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నగరం అతలాకుతలమైంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రహదారులు వాగులుగా, మురుగు కాలువలు నదులుగా మారాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగిపోయాయి. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, జీవీఎంసీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

అల్పపీడనం ప్రభావం

విశాఖకు సమీపంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరంగా భారీ వర్షం కురిసింది. కేవలం అరగంట మాత్రమే తెరిపినిచ్చి మళ్లీ కొనసాగింది. ఈ అల్పపీడనం సోమవారం వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో మరో రెండు రోజులు వర్షాలు కొనసాగుతాయని విశాఖ తుపాను **హెచ్చరికల కేంద్రం** తెలిపింది.

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



గత పది రోజుల క్రితమే వాతావరణ శాఖ హెచ్చరించినా, ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మురుగు కాలువల్లో పూడిక తీత పనులు, గెడ్డల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు **చేపట్టకపోవడం**తో నగరం జలమయమైంది. 2021లో 400 మిల్లీమీటర్ల వర్షం కురిసినా గంటలో సాధారణ స్థితికి వచ్చిన నగరం, ఇప్పుడు అందులో మూడో వంతు వర్షానికే నీట మునిగిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు, కొండవాలు ప్రాంతాల వారికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, పునరావాస కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదని ప్రజలు వాపోతున్నారు. ఆరిలోవలోని రామకృష్ణాపురంలో భారీ వర్షం కారణంగా ఓ ఇంటి ప్రహరీ గోడ కూలిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

రెడ్ అలర్ట్

వాయుగుండం ప్రభావంతో **సోమవారం** కూడా జిల్లాలో భారీ నుంచి **అతి** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బుధవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలో**మీట**ర్ల వేగంతో బలమైన ఈదురు**గాలు**లు వీస్తున్నాయని, సముద్రం **అల్లకల్లోలంగా** ఉందని తెలిపారు. విశాఖపట్నం, గంగవరం, భీమునిపట్నం పోర్టుల్లో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

జలజీవనం 8లో



మిందివానిపాలెం వద్ద మునిగిన హైవే

ఆదివారం రాత్రి 8 గంటల వరకూ విశాఖ జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు..

ప్రాంతం	వర్షపాతం (మి.మీ.ల్లో)
కాపులుప్పాడ	155.4
వరదేశీపాలెం	143.25
భీమునిపట్నం	134.5
ఆనందపురం	132.5
మధురవాడ	129.5
పీఎంపాలెం	118.5
పెదగంట్యాడ	114.7
పెందుర్తి	114.5
వేపగుంట	112.5
అక్కిరెడ్డిపాలెం(పెందుర్తి)	110.0
సుజాతనగర్	105.0
ఎండాడ	104.8
పాలవలస(పెదగంట్యాడ)	102.0
గాజువాక	94.0
మేఘాద్రిగెడ్డ	93.0
మదీనాబాగ్	92.5
ఇస్లాంపేట	92.5
శ్రీనగర్	92.5
దారపాలెం	90.0
నాతయ్యపాలెం	89.0
అగనంపూడి	86.8
గోపాలపట్నం	86.0
షీలానగర్	84.5
సీతమ్మధార	82.5
కొత్తపాలెం	82.5
మింది	81.5
ముడసర్లోవ	81.0
హెచ్‌బి కాలనీ	78.7
కూర్మన్నపాలెం	76.5
ఎన్‌ఏడీ జంక్షన్	76.2

ఎర్రిగెడ్డలో వ్యర్థాలు వెలికి తీయండి



వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏర్పడిన సమస్యలపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఆదివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్స్ సెంటర్‌ను, అలాగే ఎర్రిగెడ్డ వద్ద వ్యర్థాల తొలగింపు పనులను స్వయంగా పరిశీలించారు. వర్షాల వల్ల చెట్లు కూలడం, కాలువల్లో నీరు నిలవడం వంటి సమస్యలపై ఇప్పటివరకు 41 ఫిర్యాదులు అందాయని, వాటిలో 37 ఫిర్యాదులను ఇప్పటికే పరిష్కరించామని అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఎర్రిగెడ్డలో అధికంగా చేరుతున్న వ్యర్థాలను నిరంతరం తొలగించేందుకు జేసీబీ యంత్రాలను ఉపయోగించాలని కమిషనర్ ఆదేశించారు.



సీతకొండ నుంచి బీచ్‌రోడ్డుపైకి విరిగిపడిన కొండచరియలు



విశాలాక్షినగర్ కొండవాలులో నివాసాలపై కూలిన భారీ చెట్టు

నేడు పాఠశాలలకు సెలవు

ఆరిలోవ: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కారణంగా సోమవారం జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎస్ హరిందిర ప్రసాద్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా ఈ ఆదేశాలు పాటించాలన్నారు.

రేకుల షెడ్డు కూలి వృద్ధురాలి మృతి



మృతి చెందిన పాల సింహాచలం (ఫైల్)

కొమ్మాది: కాపులుప్పాడలోని రెడ్డిల పాలెంలో రేకుల షెడ్డు కూలి పాల సింహాచలం (75) అనే వృద్ధురాలు మృతి చెందారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు షెడ్డు గోడలు తడిసిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఆదివారం సాయంత్రం ఆమె కోళ్ల షెడ్డుకు వెళ్లగా ఒక్కసారిగా కూలిపోయింది. శిథిలాల కింద చిక్కుకున్న ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే బయటకు తీసి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచారు. ఈ సంఘటనపై భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాస్, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, స్థానిక నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌కు వర్షం అంతరాయం

విశాఖ స్పోర్ట్స్ : ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భాగంగా వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరగాల్సిన రెండు మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగించింది. రాయలసీమ రాయల్స్, కాకినాడ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్ చేసిన కాకినాడ కింగ్స్ 69 పరుగులు చేసింది. 70 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయలసీమ రాయల్స్ 68 పరుగులే చేయగలిగింది. చివరి బంతికి మూడు పరుగులు అవసరం కాగా, ధ్రువ్ కుమార్ (32) ఒక పరుగు మాత్రమే చేసి రనౌట్ అయ్యాడు. దీంతో కాకినాడ కింగ్స్ ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. అదేవిధంగా సింహాద్రి వైజాగ్ లయన్స్, భీమవరం బుల్స్ మధ్య జరగాల్సిన రెండో మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా రద్దు కావడంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు.

రక్త 'పరీక్ష'లే..!

- కేజీహెచ్‌లో రక్త పరీక్షలకు అంతరాయం
- రీజెంట్స్ లిక్విడ్ లేక నిలిచిన ఏబీజీ పరీక్షలు
- పట్టించుకోని కూటమి సర్కార్



మహారాణిపేట: ఉత్తరాంధ్రతో పాటు పలు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్)లో ముఖ్యమైన రక్త పరీక్షలు నిలిచిపోయాయి. దీనివల్ల పేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కిడ్నీ, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులను నిర్ధారించే ఆర్టీరియల్ బ్లడ్ గ్యాస్ (ఏబీజీ) పరీక్షలు గత కొన్ని రోజులుగా జరగడం లేదు.

ఈ పరీక్షలకు అవసరమైన 'రీజెంట్స్ లిక్విడ్' సరఫరా లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. గతంలో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ నుంచి ఈ లిక్విడ్ సరఫరా అయ్యేది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సరఫరా నిలిచిపోయిందని తెలుస్తోంది. బయట నుంచి కొనుగోలు చేయడానికి కేజీహెచ్‌లోని కొంతమంది వైద్యాధికారులు ఇష్టపడకపోవడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

రోగుల ఇబ్బందులు

ఏబీజీ పరీక్షలో రక్తంలో ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ శాతాలను విశ్లేషిస్తారు. కిడ్నీ వైఫల్యం, గుండె లోపాలు, డయాబెటిస్, ఆస్తమా వంటి వ్యాధులను నిర్ధారించడానికి ఈ పరీక్షలు అత్యంత కీలకం. గతంలో కేజీహెచ్‌లో రోజుకు 40 నుంచి 80 మంది రోగులకు ఈ పరీక్షలు చేసేవారు. బయట లేబోరేటరీలలో ఈ పరీక్షకు రూ. 900 నుంచి రూ. 1,300 వరకు ఖర్చవుతుంది. ఆర్థిక స్తోమత లేని పేద రోగులు ఈ పరీక్ష కోసం ఎదురుచూస్తున్నారు.

యంత్రాలకు మరమ్మతులే కారణం

ఈ విషయంపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి మాట్లాడుతూ, ఏబీజీ పరీక్షలకు స్వల్ప అంతరాయం కలిగిందని తెలిపారు. యంత్రాలకు మరమ్మతులు జరుగుతున్నాయని, రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అయితే 'రీజెంట్స్ లిక్విడ్' లేకపోవడం గురించి మాత్రం ఆమె స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు.

చరిత్రను వక్రీకరించేందుకే పాఠ్యాంశాల తొలగింపు

పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం: చరిత్రను వక్రీకరించే ఉద్దేశంతోనే పాఠ్యాంశాలను తొలగిస్తున్నారని పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆరోపించారు. పాఠ్యాంశాలు మార్చినంత మాత్రాన సత్యం మారిపోదన్న అంశంపై ఆదివారం విశాఖలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్‌సీఈఆర్టీ సంస్థ 10, 11వ తరగతుల పుస్తకాల్లోని అనేక పాఠ్యాంశాలను తొలగించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ పాఠ్యాంశంలో మౌలానా అబ్దుల్ కలాంకు సంబంధించిన పేరాను, సైన్స్ విభాగంలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, జీవశాస్త్రంలో పీరియాడిక్ టేబుల్‌ను తొలగించారని ఆయన చెప్పారు. ముఖ్యంగా 8వ తరగతి చరిత్ర పుస్తకంలో మొఘల్ చక్రవర్తులైన అక్బర్, బాబర్, షాజహాన్ తదితరుల చరిత్రను పూర్తిగా తొలగించారని లక్ష్మణరావు తెలిపారు. వారిని కేవలం క్రూరులుగా, దుర్మార్గులుగా చూపించే పేరాలను మాత్రమే ఉంచారని విమర్శించారు. ఎర్రకోట, తాజ్‌మహల్ వంటి నిర్మాణాలు వారి హయాంలో నిర్మించినవేనని గుర్తు చేశారు. సదస్సులో పాల్గొన్న ఏయూ హిస్టరీ విభాగం విశ్రాంత ఆచార్యుడు కె. సూర్యనారాయణ మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత భారీ స్థాయిలో చరిత్రలో మార్పులు చేయలేదని అన్నారు. మొఘలులపై ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ, మత విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. భారతదేశం హిందూ దేశం కాదని, ఇక్కడ కోట్లాది మంది ముస్లింలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. చరిత్రలోని మంచి చెడులను యథాతథంగా పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

ఐవీఎఫ్ కేంద్రాల్లో వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు



ఐవీఎఫ్‌సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: నగరంలోని 'సృష్టి' ఐవీఎఫ్ సెంటర్‌లో అక్రమాలు బయటపడిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లాలో ఉన్న ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లపై తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటివరకు 53 సెంటర్లలో 32 కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగుచూశాయి. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వైద్య ఆరోగ్యశాఖకు చెందిన డాక్టర్ ఉమావతి, డాక్టర్ సమత, డాక్టర్ లూసీ తదితరులు వేర్వేరు బృందాలుగా ఏర్పాటు ఈ సెంటర్లు తనిఖీలను ముమ్మరం చేశారు. చాలా కేంద్రాలు సేవలకు సంబంధించి సరైన రసీదులు ఇవ్వడం లేదని, నగదు లావాదేవీలను పుస్తకాల్లో నమోదు చేయడం లేదని అధికారులు గుర్తించారు. కొన్ని సెంటర్లు 100శాతం గ్యారెంటీ, 'పిల్లలు పుట్టకపోతే డబ్బులు తిరిగి ఇస్తాం' వంటి ప్రకటనలతో నిస్సహాయ మహిళలను ఆకర్షించి, వారి నుంచి రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు వసూలు చేస్తున్నారని తనిఖీల్లో తేలింది. ఈ దారుణమైన దోపిడీని అరికట్టేందుకు, ప్రతి సెంటర్‌లో చార్జీల వివరాలను తప్పనిసరిగా బోర్డుపై ప్రదర్శించాలని డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. మిగిలిన కేంద్రాలను కూడా త్వరలో తనిఖీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

తల్లిదండ్రులకు చిన్నారుల అప్పగింత


చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కొమ్మాది: పీఎంపాలేనికి చెందిన ఐదుగురు చిన్నారులు తల్లిదండ్రులకు చెప్పకుండా ఆదివారం రుషికొండ బీచ్‌కు వచ్చారు. వర్షం పడుతున్నప్పటికీ ఐదుగురు చిన్నారులు ఆ ప్రాంతంలో తిరుగుతుండటం చూసి మెరైన్ పోలీసులు వారిని ప్రశ్నించారు. తాము పీఎంపాలెం నుంచి తల్లిదండ్రులకు చెప్పకుండా ఇక్కడకు వచ్చామని కె.హర్షిన్, ఎ.హాశ్వంత్, పి.కల్యాణి, ఎ.హర్షిత, ఎ.వంశీ తెలిపారు. వెంటనే పోలీసులు వారి నుంచి తల్లిదండ్రుల వివరాలు తెలుసుకుని.. వారికి సమాచారం అందించారు. రుషికొండకు చేరుకున్న తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను సురక్షితంగా అప్పగించారు.

గంజాయి తరలిస్తున్న కారు డ్రైవర్‌కు రిమాండ్

ఏడాదిన్నర బాలుడి మృతికి ఇతనే కారణం


అర్జునన్ జెమినీ

మద్దిపాలెం: ఊర్వశి జంక్షన్ సమీపంలో ఈ నెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఏడాదిన్నర వయసున్న వర్షిత్ అనే బాలుడు మృతి చెందాడు. ఈ ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ నెల 16న కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు కారును తనిఖీ చేయగా.. అందులో 21 కిలోల గంజాయి లభించింది. దీంతో పోలీసులు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఆదివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివి. తమిళనాడుకు చెందిన అర్జునన్ జెమినీ అద్దెకు ఈ నెల 12న విజయవాడలో ఒక ప్రైవేట్ సంస్థ నుంచి ఆన్‌లైన్ ద్వారా కారును అద్దెకు తీసుకున్నాడు. ఆ కారులో అతను అరకు వెళ్లి సుమారు 21 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. గంజాయితో ఎన్ఏడీ కొత్తరోడ్డు మీదుగా విశాఖ రైల్వే స్టేషన్ వైపు వస్తున్న క్రమంలో.. ఊర్వశి జంక్షన్ బీఆర్టీఎస్ రహదారిపై రోడ్డు దాటుతున్న దంపతులను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వారి కుమారుడు వర్షిత్ గాల్లోకి ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో కంచరపాలెం పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు కారు తాళాలు కనిపించకపోవడంతో.. ట్రాఫిక్ పోలీసులు డూప్లికేట్ తాళాలను తెప్పించి కారును తనిఖీ చేశారు. కారు వెనుక డిక్కీలో 21 కిలోల గంజాయిని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే కంచరపాలెం శాంతి భద్రతల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అర్జునన్‌ను విచారించి రిమాండ్‌కు తరలించారు. గంజాయి వ్యవహారంలో అతనికి ఇంకా ఎవరైనా సహకరించారా అనే కోణంలో కూడా కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మరొకరు మృతి

ఐదుకు చేరిన మృతుల సంఖ్య

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ రోడ్డులో ఇటీవల జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ప్రమాదంలో గాయపడిన మరొకరు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. ఈ నెల 7న హార్బర్ రోడ్డులో గ్యాస్ సిలిండర్ పేలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, కేజీహెచ్‌కు తరలించిన తర్వాత కొద్దిసేపటికి మరొకరు చనిపోయారు. 15న ఇప్పిలి రంగారావు మరణించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత కేజీహెచ్ ప్లాస్టిక్ వార్డులో చికిత్స పొందుతున్న ఎల్లాజీ గుండెపోటుతో మృతి చెందినట్లు కేజీహెచ్ వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో గాయపడిన మరో బాధితుడు నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఈపీడీసీఎల్‌లో బదిలీల బంతాట!

- సర్కిళ్లలో బదిలీలకు సిద్ధమవ్వాలంటూ ఉద్యోగులకు ఆదేశాలు
- ఇప్పటికే ఉద్యోగులకు ఆప్షన్లు ఇవ్వాలంటూ మార్గదర్శకాలు
- కొత్త సర్కిల్‌కి బదిలీ చేస్తే ఉద్యోగ విరమణ వరకూ అక్కడే విధులంటూ షరతు
- ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశాలు జూనియర్లకే ఎక్కువ ఉండటంతో ఆందోళన
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు

ఈపీడీసీఎల్ పరిధిలో..	
జూనియర్ అసిస్టెంట్లు	470
సీనియర్ అసిస్టెంట్లు	626
టైపిస్ట్/యూడీస్టెనో/ఎల్‌డీ స్టెనో	66
సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు	107

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో గతంలో జరిగిన జిల్లాల విభజనకు అనుగుణంగా ఈపీడీసీఎల్‌లో సర్కిళ్లను విభజించారు. అయితే ఇప్పుడు ఆయా సర్కిళ్లకు అనుగుణంగా ఉద్యోగులను బదిలీ చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేయడంతో ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. ఈ బదిలీల ప్రక్రియలో జూనియర్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్తగా బదిలీ అయిన సర్కిల్‌లోనే ఉద్యోగ విరమణ వరకు విధులు నిర్వర్తించాలన్న ప్రభుత్వ షరతుపై ఉద్యోగులు మండిపడుతున్నారు. మరోవైపు కొత్తగా జిల్లాల పునర్విభజన జరగవచ్చని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఇప్పుడే బదిలీలు చేపట్టవద్దని ఉద్యోగులు కోరుతున్నారు. అయినా అధికారులు ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు.

బదిలీ మార్గదర్శకాలపై అసంతృప్తి

రెండేళ్ల కిందట జరిగిన సర్కిళ్ల పునర్విభజనకు అనుగుణంగా బదిలీలు చేసేందుకు ఈపీడీసీఎల్ అధికార యంత్రాంగం సిద్ధమైంది. గతంలో ఈపీడీసీఎల్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరుతో కలిపి మొత్తం 5 సర్కిళ్లు ఉండేవి. జిల్లాల పునర్విభజన తర్వాత సర్కిళ్ల సంఖ్య 11కి పెరిగింది. అవి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు సర్కిళ్లు. అయితే సర్కిళ్లు విభజించినప్పటికీ ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బదిలీలు చేపట్టేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

జూనియర్లను బలిచేసేలా..

సర్కిళ్ల ప్రకారం ఉద్యోగుల బదిలీలు చేపట్టనున్నట్లు ఇటీవలే మార్గదర్శకాలు విడుదలయ్యాయి. కొత్తగా వచ్చిన సర్కిళ్లకు బదిలీపై వెళ్లాల్సి ఉంటుందని.. ఏ సర్కిల్‌కు వెళ్లాలో నిర్ణయించుకోవాలంటూ ఆప్షన్లు ఇచ్చింది. కొత్తగా ఏర్పాటైన ఆరు సర్కిళ్లకు బదిలీలుండనుండగా.. ఉద్యోగి నేస్తం పోర్టల్‌లో ఆప్షన్లు పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో జూనియర్లనే ఎక్కువగా ట్రాన్స్‌ఫర్ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం విధించిన షరతు జూనియర్లలో మరింత ఆందోళన రేపుతోంది. ఈ ప్రక్రియలో సీనియర్లకు మాత్రమే ఆప్షన్లు ఎంచుకునే అవకాశం ఇచ్చారు. దీంతో 90 శాతానికి పైగా సీనియర్లు బదిలీ నుంచి తప్పించుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది. కొద్దిమంది సీనియర్లు మాత్రమే అనారోగ్యం వంటి కారణాలతో సొంత జిల్లాకు బదిలీ అయ్యేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో జూనియర్లకే ఎక్కువగా మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. బదిలీ అయిన ఉద్యోగి తన ఉద్యోగ విరమణ వరకు అదే సర్కిల్‌లో పనిచేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఈ షరతు వల్ల జూనియర్లు పదోన్నతులు పొంది ఉన్నత స్థానాలకు వెళ్లే అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

పునర్విభజన జరిగితే మళ్లీ బదిలీలు చేస్తారా?

వచ్చే వారం పది రోజుల్లో బదిలీల ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే ఉద్యోగ సంఘాలు ఈ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. జూనియర్లకు ఇబ్బందులకు గురి చేయకుండా.. పాత పద్ధతిలోనే బదిలీలు చేపట్టాలని, బదిలీలలో పారదర్శకత పాటించాలని కోరుతున్నాయి. మరోసారి జిల్లాల పునర్విభజన జరిగితే కొత్త సర్కిళ్లు ఏర్పడతాయని, అప్పుడు మళ్లీ బదిలీలు చేయాల్సి ఉంటుందని ఉద్యోగులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియను నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్మాదుల్లా టీడీపీ ఎమ్మెల్యేలు

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మంచా నాగ మల్లేశ్వరి ఆగ్రహం



సాక్షి, విశాఖపట్నం: టీడీపీ ఎమ్మెల్యేలు మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని, వారి వేధింపులకు భయపడి మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మరికొందరు రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, దళిత మహిళా నేత మంచా నాగ మల్లేశ్వరి మండిపడ్డారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలు లైంగికంగా వేధిస్తున్నారని, పనులు కావాలంటే పక్కన పడుకోవాలని మహిళలను వేధిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక దళిత మహిళా ఉద్యోగినిని లైంగికంగా వేధించారని, అందరి ముందు అవమానించారని ఆమె అన్నారు. మరో టీడీపీ ఎమ్మెల్యే నజీర్ కారణంగా ఒక మహిళ ఆత్మహత్య చేసుకుందని, ఎమ్మెల్యే ఆదిమూలం వేధింపులకు భయపడి ఒక మహిళ రాష్ట్రం విడిచి వెళ్లిపోయిందని ఆమె పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా చోడవరం టీడీపీ ఎమ్మెల్యే రాజు తన పార్టీ నాయకుడు చెప్పిన వారికి సీటు ఇవ్వలేదనే కారణంతో ఒక మహిళా ఉద్యోగినిని అందరి ముందు బండ బూతులు తిట్టారని, దాంతో ఆమె స్పృహ కోల్పోయి పడిపోయారని తెలిపారు. ఇలా ప్రజా ప్రతినిధులే మహిళలను వేధిస్తుంటే, ఆ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు మరింతగా అఘాయిత్యాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దళిత మహిళలపై దాడులు, వేధింపులు జరుగుతున్నా దళిత హోంమంత్రి వంగలపూడి అనిత నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఆ కామ పిశాచులను అరెస్ట్ చేయడం లేదని ఆమె ఆరోపించారు. అనంతపురంలో 14 ఏళ్ల మైనర్ బాలికపై 14 మంది టీడీపీ కార్యకర్తలు లైంగికదాడికి పాల్పడి హత్య చేస్తే, వారిపై చర్యలు లేవని, కనీసం హోంమంత్రి బాధిత మహిళ కుటుంబాన్ని పరామర్శించలేదన్నారు. ఇలాంటి చేతగాని హోంమంత్రి అనిత ఆ పదవికి అనర్హురాలని, తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు, అత్యాచారాలకు పాల్పడిన టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలపై ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా దళితులంతా ఉద్యమిస్తామని నాగమల్లేశ్వరి హెచ్చరించారు.

ఎమ్మెల్యే కూనపై చర్యలకు డిమాండ్

తగరపువలస: శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలోని కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న దళిత మహిళ సౌమ్యను వేధిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా ఆదివారం భీమిలి మండలం తాళ్లవలసలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన తన సామాజిక వర్గానికి చెందిన మహిళను ప్రిన్సిపాల్‌గా నియమించుకోవడానికి దళిత ప్రిన్సిపాల్‌ను బలి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు పొంది రాష్ట్రంలో 30 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు ఉన్నప్పటికీ దళితులపై దాడులు జరుగుతున్నప్పుడు వారు స్పందించకపోవడం శోచనీయమన్నారు. సౌమ్యపై తప్పుడు ఆరోపణలు చేసి ఆమె బదిలీకి కారణమైన కూనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సౌమ్యను అదే విద్యాసంస్థలో కొనసాగించాలని కోరారు. మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు బోని సన్నిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సియ్యాద్రి రాంబాబు, యాగాటి రామారావు, బోని ప్రసాద్, నరసింగరావు, లోకేష్, ఎజ్జల దాసు, రామారావు, టి.సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

జలజీవనం

- కుండపోత వర్షానికి అతలాకుతలం
- విరిగిపడిన కొండచరియలు, కూలిన గోడలు, చెట్లు

కొమ్మాది/ఆరిలోవ/పరవాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా అతలాకుతలమైంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం రోజంతా కుండపోతగా కురిసిన వర్షానికి నగరం, శివారు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించగా, రహదారులు వాగులయ్యాయి. కొండచరియలు విరిగిపడటం, ఇళ్ల గోడలు, చెట్లు కూలిపోవడం వంటి ఘటనలతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

తీరంలో కలవరం.. నిలిచిన వేట

భారీ వర్షాల నేపథ్యంలో తీరప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. కొమ్మాది, రుషికొండ, తిమ్మాపురం, మంగమారిపేట, చేపలుప్పాడ, జాలరిపేట, అప్పుఘర్ తదితర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు వేటకు విరామమిచ్చారు. అలలు పెద్ద ఎత్తున ఎగసిపడుతుండటంతో.. పడవలు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రుషికొండ బీచ్‌లో పర్యాటక శాఖ నిర్వహిస్తున్న స్పీడ్ బోట్ సేవలను పూర్తిగా నిలిపివేసి, బోట్లను తీరంలో భద్రపరిచారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో లైఫ్‌గార్డ్స్, మెరైన్ పోలీసులు పర్యాటకులను అప్రమత్తం చేశారు. సాగర్‌నగర్‌లో ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సుల కోసం ఇటీవల ఏర్పాటు చేసిన చార్జింగ్ పాయింట్ పూర్తిగా నీట మునిగింది. పరదేశిపాలెం గెడ్డ ఉప్పొంగి ప్రవహించడంతో పరదేశిపాలెం-కాపులుప్పాడ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.


మద్దిలో నీట మునిగిన వరి నాట్లు

కొండవాలులో ఆందోళన

వర్షాలకు కొండ ప్రాంతాలు ప్రమాదకరంగా మారాయి. సీతకొండపై నుంచి వైఎస్సార్ సీవ్యూ పాయింట్ వద్ద బండరాళ్లు, మట్టి పెళ్లలు జారి రోడ్డుపై పడ్డాయి. వెంకోజీపాలెం- హనుమంతవాక మధ్యలో కూడా కొండరాళ్లు జారిపడ్డాయి. జీవీఎంసీ సిబ్బంది స్పందించి, రహదారులపై పడిన మట్టి, రాళ్లను తొలగించారు. మరోవైపు వర్షాలకు నానిన ఇళ్ల గోడలు, ప్రహరీలు పలుచోట్ల కూలిపోతున్నాయి. జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి కొండవాలు ప్రాంతంలో ఓ ఇంటి గోడ కూలి కిందనున్న ఇంటిపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రాంతం హనుమంతవాక కొండవాలులో భారీ చెట్టు కూలి నివాసాలపై పడటంతో ఇళ్ల గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విద్యుత్, కేబుల్ తీగలు తెగిపోయాయి. జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో ఓ ఇంటి పిట్టగోడ కూలింది. దీంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.


బీచ్‌రోడ్డులో వర్షపు నీటిలో రాకపోకలు

గోడ కూలి వృద్ధుడి పాట్లు

పెదగదిలి, సింహగిరి కాలనీ మధ్యలో దేవస్థానం కొండవాలులో ఓ ఇంట్లో సారికి పైడిరాజు, మూర్తమ్మ నివాసముంటున్నారు. వృద్ధాప్యంతో ఉన్న పైడిరాజు కాలికి గాయంతో కొన్నాళ్లుగా ఇంట్లోనే కదల్లేని స్థితిలో ఉన్నారు. భారీ వర్షంతో ఆయన నివాసముంటున్న ఇంటి ముందు గోడ కూలిపోయింది. దీంతో పైడిరాజు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఇంకా వర్షాలు కురిస్తే ఇల్లు కూడా కూలిపోతుందనే భయంతో కుటుంబ సభ్యులు అతన్ని ఇరుకు దారిలో మోసుకుంటూ తెలిసిన వారి ఇంటికి తరలించారు.

ఒకరికి తీవ్ర గాయాలు

పరవాడ మండలం తిక్కవానిపాలెంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి దూడ బంగారి (50) అనే వ్యక్తి ఇంటి పోర్టికోపై నిర్మించిన పిట్టగోడ నానిపోయి, కింద షెడ్డులో నిద్రిస్తున్న ఆయనపై కూలింది. ఈ ప్రమాదంలో బంగారి మెడకు తీవ్ర గాయం కాగా, కాలు విరిగింది. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తహసీల్దార్ నాగరాజు, వీఆర్వో అప్పారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.


పెదగదిలిలో వర్షానికి కూలిన ఇంటిగోడ


గోడ కూలిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బంగారి


వృద్ధుడిని మోసుకుంటూ వేరే ఇంటికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు


మంగమారిపేట వద్ద ఎగసిపడుతున్న సముద్ర కెరటాలు


ఉధృతంగా ప్రవహిస్తున్న పరదేశిపాలెం గెడ్డ



రుషికొండ తీరంలో నిలిపిన స్పీడ్ బోట్లు

గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి గాయాలు


గాయపడి చికిత్స పొందుతున్న శిరీష


ముఖం,చేతులు కాలిన గాయాలతో లక్ష్మి



గాయపడిన ఎస్.కృష్ణ

కూర్మన్నపాలెం: గాజువాకలో ఒక గ్యాస్ సిలిండర్ నుంచి మరొక సిలిండర్‌లోకి గ్యాస్ మార్చే క్రమంలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గాయపడిన వారిలో కొత్తగాజువాకకు చెందిన ఎం. కృష్ణ (56), పాతగాజువాకకు చెందిన ఎన్. లక్ష్మి (48), ఆమె మనుమరాలు శిరీష (8) ఉన్నారు. వీరందరికీ ముఖం, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కృష్ణ అనధికారికంగా గ్యాస్ రీఫిల్లింగ్ వ్యాపారం చేస్తున్నాడు. లక్ష్మి తన మనుమరాలితో కలిసి గ్యాస్ నింపుకోవడానికి వచ్చినప్పుడు, చిన్నారి శిరీష పక్కనే ఉన్న లైటర్ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రూ.9.80 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

అన్నవరం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అనేక చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను కాకినాడ జిల్లా అన్నవరం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అన్నవరం పోలీస్ స్టేషన్‌లో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆదివారం రాత్రి విలేకరులకు వివరాలు తెలిపారు. అన్నవరం, తుని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల పలు దొంగతనాలు జరగడంతో, ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు పర్యవేక్షణలో అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు, అడిషనల్ ఎస్సై ప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన అడపా జోగాఅమర్ గంగాధర్, అల్లూరి జిల్లా రంపచోడవరానికి చెందిన అడపా సూర్యచంద్రపై అనుమానంతో పోలీసులు నిఘా ఉంచారు. ఆదివారం ఉదయం వారిద్దరూ మండపాం సెంటర్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో చేసిన నేరాలను వారు అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి, వారిచ్చిన సమాచారంతో రూ.9.80 లక్షల విలువైన 500 గ్రాముల వెండి వస్తువులు, అమ్మవారి గుడిలో అపహరించిన రోల్డ్‌గోల్డ్ హారం, మూడు బుల్లెట్లు, ఆరు మోటార్ బైకులు, నాలుగు స్కూటీలు, ఎల్ఈడీ టీవీ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై హైదరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రెండు, విశాఖపట్నం జిల్లా ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఎనిమిది, తుని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మూడు, ప్రత్తిపాడు, తుని టౌన్ పోలీస్‌స్టేషన్లలో ఒక్కొక్క కేసు నమోదైనట్టు డీఎస్పీ వివరించారు. వీరిని ప్రత్తిపాడు కోర్టుకు తరలించినట్టు చెప్పారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

ఈవోఐ పేరుతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ

ఆపాలని సీపీఎం డిమాండ్

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం మళ్లీ వేగవంతం చేసిందని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆరోపించారు. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) పేరుతో ప్లాంట్‌లోని కొన్ని కీలక విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్లాంట్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్‌లో భాగమైన క్యాప్టివ్ పవర్ ప్లాంట్-2 నిర్వహణ కోసం ప్రైవేట్ సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానించిందని, ఈ నెల 16న స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (వర్క్స్ కాంట్రాక్ట్) పేరిట ఈవోఐ నోటీసు జారీ అయిందని తెలిపారు. ఈ చర్య వల్ల ప్లాంట్‌లోని కీలక విభాగాలను చిన్న చిన్న ముక్కలుగా చేసి పెద్ద ప్రైవేట్ సంస్థలకు అప్పగించే అవకాశం ఉందని ఆరోపించారు. దీని వల్ల ప్లాంట్‌లో పనిచేస్తున్న పర్మనెంట్ ఉద్యోగులు, పాత కాంట్రాక్ట్ కార్మికులతో పాటు ప్రస్తుతం ఉన్న సుమారు 600 మంది చిన్న ప్రైవేట్ ఏజెన్సీలు ప్రభావితమవుతాయని పేర్కొన్నారు. వేలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోతారని, నిర్వాసితుల ఉద్యోగాలపై కూడా ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి, కార్మిక చట్టాలను అమలు చేయకుండా, ఉపాధి భద్రత లేకుండా దోపిడీ చేస్తాయని జగ్గునాయుడు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈవోఐని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడమే తమ లక్ష్యమని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విశాఖ ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితర కూటమి నాయకులు.. ఈవోఐని రద్దు చేయించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.

ఈసీ లీలలపై విస్మయం

వయసు 56 ఏళ్లు... పుట్టింది మాత్రం 1800 సంవత్సరంలో అని నమోదు

అగనంపూడి : భారత ఎన్నికల సంఘం (ఈసీ) నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. 'ఇప్పటికింకా నా వయసు నిండి పదహారేళ్లే' అన్నట్టుగా, 56 ఏళ్ల వయసున్న ఒక ఓటరు వయసును 225 సంవత్సరాలుగా నమోదు చేసింది. ఈ ఘటనపై సామాజిక కార్యకర్త పట్టా రామ అప్పారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం అగనంపూడి నిర్వాసిత కాలనీ కొండయ్యవలసకు చెందిన తన సోదరుడు 1969లో జన్మించారని, ఆయన వయసు 56 ఏళ్లు నిండిందని రామ అప్పారావు తెలిపారు. అయితే ఆయన ఓటరు కార్డులో మాత్రం పుట్టిన తేదీ 01.01.1800గా నమోదై ఉండడం చూసి విస్మయం వ్యక్తం చేశారు. 'ఇంత గుడ్డిగా ఓటరు నమోదు ఎలా చేస్తున్నారో అర్థం కావడం లేదు' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఎలా నమోదవుతున్నాయో కూడా అర్థం కావడం లేదని రామ అప్పారావు పేర్కొన్నారు. బ్యాంక్ లావాదేవీలకు ఆధార్‌ను అనుసంధానం చేసే ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఓటరు నమోదు విషయంలో ఎందుకు ఆధార్‌ను అనుసంధానం చేయలేకపోతున్నాయో ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఈసీ నిర్లక్ష్యానికి, డొల్లతనానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.



పుట్టిన తేదీ 1800గా నమోదైన పట్టా రమణ ఓటరు కార్డు